సీరియల్

విషసర్పం సికిందర్

(గత సంచిక తరువాయి)

అత్యవసర సమావేశంలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, కమీషనరాఫ్ సిటీ పోలీస్, అసిస్టెంట్ కమీషనర్లు కొందరు, స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్లు కొందరు, హత్యల ఇన్‌ఛార్జి తీసుకున్న డిటెక్టివ్ యిన్‌స్పెక్టర్లు కొందరు (కృష్ణన్‌తో సహా), పోస్టుమాస్టర్ జనరల్‌తో పాటు అడ్వకేట్ జనరల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కూడా వున్నారు.

సమావేశంలో అసలా కరపత్రాలెలా ప్రజలకి సరఫరా అయ్యాయన్న డి.జి.పి. ప్రశ్నకు కమీషనర్ సమాధానం చెబుతూ, ముందే వేసుకున్న ప్రణాళికతో వాటిని రాత్రి సమయంలోనే ఇళ్ళ తలుపులలోంచి వేయడం జరిగిందనీ, మళ్ళీ ఉదయం కొందరు కుర్రాళ్ళకి డబ్బులిచ్చి అన్ని పబ్లిక్ స్థలాల్లోనూ పంచిపెట్టించారని వివరించాడు.

ఆ కుర్రాళ్ళని గంటన్నరపాటు నిర్బంధించి ఎంత ప్రయత్నించినప్పటికీ ఆ ఆగంతకుల వివరాలు, ఆనవాలు

చెప్పలేదనీ — చెప్పలేకపోయారనీ అన్నాడు.

కరపత్రాలు ఎక్కడచ్చయ్యాయన్న ప్రశ్న వచ్చింది. వాటిలో కొన్ని ఆఫ్‌సెట్‌లోనూ, కొన్ని ఫోటో టైప్ సెట్టింగ్‌లోనూ ప్రింటయ్యాయని కమీషనర్ అన్నాడు. అలాటి ప్రెస్సుల్ని ఉదయమే విచారించడం జరిగిందనీ, ఫలితం లేకపోయిందనీ అన్నాడు.

డి.జి.పి. మాట్లాడుతూ అన్నాడు, "దీన్ని మనం ఆపాలి. లేకపోతే స్మశాన వాటిక అవుతుంది మన నగరం. అప్పుడు మన అవసరం ఇక్కడ వుండదు, ఇళ్ళకు వెళ్ళిపోవచ్చు డిపార్టుమెంటును ఎత్తేసి.

జంటిల్‌మెన్, ఈ స్నేక్ సొసైటీ వాళ్ళ ప్రకటనే మతి చలించినవాడి ప్రేలాపనలా వుంది. దీని సైడ్ ఎఫెక్ట్స్ వాళ్ళు గ్రహించారో లేదో, వాళ్ళిలా రంగంలో దిగారంటే మాత్రం ఎన్నో అనర్థాలూ, అఘాయిత్యాలూ జరిగిపోతాయి. అసలు వాళ్ళ సదుద్దేశ్యానికే అర్థం లేకుండా పోతుంది. యెవరికి తెలుసు— వాళ్ళకి చేరే ఉత్తరాలన్నీ సిసలైన కేసులేనని? మీ పక్కవాడు మీమీద ఏదో కక్ష పెట్టుకుని సూడో నేమ్‌తో ఆ సొసైటీకి వ్రాస్తే మీరన్యాయంగా ప్రాణాలు విడవాల్సిందేనా?"

గదిలో ఒక్కసారి కలకలం బయలుదేరింది.

"అందుకే—" డి. జి. పి. కొనసాగించాడు, "ఈ సొసైటీ వ్యవహారాన్ని మనం త్వరగా తేల్చెయ్యాలి. వీళ్ళ ఆట కట్టించాలి. మొదట్నించీ వీళ్ళు మనకు సవాలుగానే పరిణమించారు. ఈ నాలుగైదు రోజులుగా జరుగుతున్న అమానుషాలు ఇంతకుముందెన్నడూ ఎరగం. హత్యలైతేనేమి, చావులైతేనేమి ఇంతవరకు నగరంలో

మొత్తం ముఫ్ఫైమూడు జరిగాయి. మానభంగాలు నాలుగు జరిగాయి. ఇవిలా జరగడానికి వీల్లేదు! ఆ గ్యాంగ్ ని మనం వీలయినంత త్వరగా పట్టుకుని ధ్వంసం చేయాలి!"

"సర్, మన తక్షణ కర్తవ్యం ఆ సొసైటీకి ప్రజల నుంచి ఏ ఉత్తరం చేరకుండా చూడడం!" అన్నాడు కమిషనర్.

"అవును, సిటీలో అన్ని పోస్టాఫీసుల్లోనూ స్నేక్ సొసైటీ పేరుమీద వచ్చే ఉత్తరాలకోసం ఎలర్టుగా ఉండమని హెచ్చరించాలి. అలాటి ఉత్తరాల్ని సార్టింగ్ చేసి ప్రక్కన పడేయాలి...." అని పోస్టు మాస్టర్ జనరల్ వైపు చూశాడు. డి.జి.పి.

"అలాగే, నేనలా ఆర్డర్స్ పాస్ చేస్తాను. అయితే ప్రతీ పోస్టాఫీసుకీ అప్పుడు రక్షణ అవసరం. దాడులు జరిగే అవకాశముండొచ్చు...." అన్నాడు పోస్టుమాస్టర్ జనరల్.

"ఆల్ రైట్, అన్ని పోస్టాఫీసులవద్దా ఆర్మ్డ్ రిజర్వ్ గార్డు చేస్తుంది...."

"అలాటి లెటర్స్ అన్నింటినీ డి.ఎల్.ఓ.కి పంపించమంటారా?"

"నో, వాటిని మాకు పంపండి. కానీ ఇది మనమనుకున్నంత సులభమా? నాకో అనుమానం కలుగుతోంది."

"ఏమిటి?" కమీషనర్ అడిగాడు.

"వాళ్ళు చిరునామా ఇచ్చి ఆ ఇంటిని ఖాళీగా వుంచడం యే ఉద్దేశ్యంతో చేశారు? వాళ్ళకు కచ్చితంగా తెలిసి వుండాలి. కరపత్రాలు సర్క్యులేట్ అయిన ఆ మరుక్షణంలో ఆ యింటిమీద మనం రెయిడ్ చేస్తామనీ, గార్డ్ చేస్తామనీ, అప్పుడా ఉత్తరాలు వాళ్ళ

కందే అవకాశముండదనీ....”

“అడ్వకేట్ జనరల్ తల విదిలించాడు. “బహుశ వాళ్ళ ఉద్దేశ్యం ఇదయ్యుండాలి — పోస్టుమాస్టర్ జనరల్ గారన్నట్లు దాడులు జరపడం. అప్పుడు తమ ఉత్తరాల్ని గుర్తుపట్టేందుకు యేదో ఒక అడ్రసు కావాలిగా?”

“అలాంటప్పుడు ఇల్లు తీసుకోవడమెందుకు?” అన్నాడు డి.జి.పి. “నిజం అడ్రసు ఇవ్వడమెందుకు? యేదో ఫిక్టీషస్ అడ్రసిస్తే సరిపోతుందిగా?”

“సరిపోతుంది — అంత వివరంగా అడ్రసివ్వకుండా కేవలం స్నేక్ సొసైటీ హైదరాబాద్ అన్నా సరిపోతుంది వాళ్ళకు - తమ ఉత్తరాల్ని గురించి దోచుకునేందుకు. కానీ వాళ్ళంతా అమెచూరిష్‌గా తీసుకోవడంలేదీ వ్యవహారాన్ని. ప్రజలకి తమ నిజాయితీ నిరూపించుకునే ఉద్దేశ్యంతో అద్దె యిల్లు తీసుకుని—నిజం అడ్రసివ్వడంలో ఆశ్చర్యంలేదు. అంతేకాదు, ఆ ఉత్తరాలకోసం పోస్టాఫీసులమీద దాడులు జరపడం కూడా ప్రమాదకరమని వాళ్ళకు తెలిసివుండాలని నాకిప్పుడనిపిస్తోంది..”

“మరింకేం చేస్తారు?”

అడ్వకేట్ జనరల్ చెప్పాడు. “పోస్టల్ ఉద్యోగుల తోడ్పాటుతో ఏదైనా జరుగవచ్చనిపిస్తోంది....”

“అంటే?”

“మెయిల్ సార్టర్స్ వాళ్ళతో చేతులు కలిపారంటే అంతా సులభం!”

“ఓహ్....” పోస్టల్స్ అధికారి ఉలిక్కిపడ్డాడు.

వెంటనే కమీషనర్ అందుకున్నాడు, “అలా జరుగుతుందనుకోను, కానీ జాగ్రత్తకోసం ఒక యేర్పాటు

చేయవచ్చు... ప్రతీ పోస్టాఫీసులోనూ మన స్పెషల్ బ్రాంచి మనిషిని ప్లాంట్ చేసేందుకు పి.యమ్.జి.గారు అనుమతి స్తే బాగుంటుంది."

"అయాం రెడీ!"

"థాంక్యూ."

"ఇప్పుడు—" అడ్వకేట్ జనరల్ నోరు విప్పాడు, "అసలీ రిస్కులన్నింటికంటే, ఉత్తరాలు పోస్టాఫీసుకి చేరే ప్రశ్నే లేకుండా చేసే మార్గమొకటివుంది...."

"ఏమిటది?" డి.జి.పి. అడిగాడు కుతూహలంగా.

"ఎవరూ ఉత్తరాలు రాయకుండా నిరోధించాలి."

"అదెలా?"

"స్నేక్ సొసైటీకి అలా ఉత్తరాలు రాసేవాళ్ళు ఆ తరువాత తలెత్తే పరిణామాలకి పూర్తి బాధ్యత తామే వహించాల్సి వుంటోంది.... సర్, అలా ఉత్తరాలు వ్రాయడం హత్యకు ఆదేశించడమే. ఇది చట్టరీత్యా నేరం. శిక్షార్హులౌతారు. దీని ఉల్లంఘన ద్వారా హత్య జరిగిపోతే, అప్పుడా హతుని పూర్వ సంబంధాలన్నీ పరిశీలించబడతాయి."

"వెల్, తర్వాత?"

"అప్పుడా లేఖకులు యాంత్రికంగా పట్టుబడి పోతుంది. ప్రాసిక్యూషన్ జరుగుతుంది."

"వెల్, బాగుంది. కానీ పూర్వ సంబంధాల్ని యెలా పరిశీలిస్తారు?"

"సింపుల్. ఈ స్నేక్ సొసైటీ న్యూసెన్స్ వల్ల యెవరైతే తమ ప్రాణాలకి హానివుందని తోస్తుందో, వాళ్ళకు ఆ హానిని కల్గించే లేఖకులెవరో తెలిసే వుంటుంది గాబట్టి, ఆమె పూర్తి పేరు వివరాలూ తెలియ

పడుస్తూ ఒక సీల్డు కవరుని దగ్గర్లోని పోలీస్ స్టేషన్‌లో అందిస్తే చాలు. అప్పుడతనికేదైనా సంభవిస్తే ఆమె ఇట్టే దొరికిపోతుంది...."

కాన్ఫరెన్సులో మళ్ళీ గుసగుసలు బయలుదేరాయి. అందరూ తమ ఆమోదాన్ని తెలిపారు."

"వెరీ వెల్, బాగుంది" అన్నాడు డి.జి.పి.

"ఉత్తరాలు వ్రాసే వాళ్ళకిలాంటి భయం కల్గిస్తే, వాళ్ళ జోలికి పోరు." అన్నాడు అడ్వకేట్ జనరల్

"కానీ ఈ పాటికి రాసేశారేమో?"

"వ్రాసివుంటే మన స్వాధీనమవుతాయి. కనీసం రేపటినుంచి ఆపవచ్చు."

"ఆల్ రైట్ — వెంటనే ఇది బ్రాడ్ కాస్టు చేయించాలి, ఈవెనింగర్స్‌కి ప్రెస్ నోట్ రిలీజ్ చేయాలి — ఈ హెచ్చరిక! సొసైటీకి ఉత్తరాలు రాసేవారు తమ అంతాన్ని తామే కోరి తెచ్చుకుంటారు!"

"ఆ తర్వాత —" అడ్వకేట్ జనరల్ అన్నాడు, "ముఖ్యంగా ఈ సుహాసిని ఫోటో మరోసారి అన్ని పత్రికల్లో ప్రచురించాలి. వాల్ పోస్టర్స్ పెద్దవి మొదలైనవి విరివిగా ప్రచురిస్తే హంతకురాలెవరో బాగా తెలుస్తుంది ప్రజలకి — వాళ్ళు జాగ్రత్త పడడానికీ — వీలయితే ఆమెను పట్టివ్వడానికీ."

"దటీజ్ రైట్, ఆ పనికూడా చేస్తాం."

"ఇక మరొకటుంది — సైడ్ ఎఫెక్టు. ఈ సొసైటీ మొత్తం స్కీమూ బ్యాక్ ఫైరయ్యే అవకాశముంది, జంటిల్ మెన్. ఎలాగంటే, హతులు కాబోయే వాళ్ళకి బదులు ఉత్తరాలు రాయబోయేవాళ్ళే ప్రాణాలు పోగొట్టుకోవచ్చు. తాము వంచించిన మనిషి సొసైటీకి

తనమీద ఉత్తరం వ్రాస్తుందన్న భయంతో ముందే జాగ్రత్తపడవచ్చు అంచనడు. ఆమెను నిర్దాక్షిణ్యంగా చంపివేయవచ్చు."

"గాడ్! అవును—"

"లేదా ఉత్తరం వ్రాస్తానని అంచనడ్ని అంచనరాలే బెదిరించవచ్చు. బ్లాక్ మెయిల్ చేయవచ్చు. ఈ బ్లాక్ మెయిల్ వాళ్ళ ప్రేమ సాఫల్యతకైతే ఫరవాలేదు. మరేదో దురుద్దేశ్యంతో—ధనాశతో జరిగితే మాత్రం అరాచకాలు మొదలవుతాయి, జంటిల్ మెన్."

"అపండి, అలాటివి మనం పసిగట్టి నివారించలేం. కనీసం ఈ సొసైటీవల్ల వచ్చే అపాయాన్ని నిరోధించగల్గాలి. వాళ్ళకి ఉత్తరాలు అందకూడదు, ఇదొక్కటే మార్గం. దీనిమీదే మనం గట్టిగా కృషి చేయాలి. ఇంకో వైపు శత్రువుల్ని ట్రేస్ చేయాలి...."

సమావేశం ముగిసింది.

సరిగ్గా ఆ సమయంలోనే నగరంలోని అనేక ప్రాంతాలలో స్ట్రీట్ పోస్టు బాక్సులు క్లియరెన్స్ సమయం కంటే ముందే తెరుచుకోసాగాయి....

తెరుస్తున్న వాళ్ళు మాత్రం పోస్టల్ డిపార్టుమెంటుకి చెందినవాళ్ళు కారు. కానీ అలాటి యూనిఫారాల్లో నే వున్నారు.

అప్పటికి కరపత్రాలు విడుదలై కొన్ని గంటలే అయింది కాబట్టి, మొదటిసారి యెక్కువ సంఖ్యలో ఉత్తరాలు సంగ్రహించలేకపోయారు, ఆ పోస్టల్ డిపార్టుమెంట్ కాని డిపార్టుమెంట్ వాళ్ళు.

• • •

బాలా నగర్ యిండస్ట్రియల్ ఎస్టేట్ లో లాబ్

కెమికల్స్ తయారుచేసే ప్లాంట్ గల సేఠ్ చిమన్ భాయ్ తన ఏర్ కండిషన్డ్ ఆఫీసులో ఫైళ్ళని చూస్తూ గడుపుతున్నప్పుడు, హఠాత్తుగా ఫోన్ మోగి అతడి ఏకాగ్రతకి భంగం కల్గించింది.

అతను విసుగ్గా రిసీవరెత్తి రెస్పాన్స్ ఇచ్చాడు.

ఒక కరుకైన గొంతు పలికిందవతలనుంచి. "మిష్టర్ చిమన్ భాయ్, నేను మోహినిని మాట్లాడుతున్నాను."

"అతను ముఖం చిట్లించాడు, "మోహిని? యే మోహిని?...."

"నన్ను మర్చిపోయావా?"

"ఎవర్నువ్వు?"

"ఓహ్, నీకెక్కడ గుర్తుంటుంది, చిమన్ భాయ్. ఎందర్నని గుర్తుపెట్టుకుంటావ్. నాలాటి వాళ్ళు ఎందరో నీ జీవితంలో. కానీ నీలాటివాడు నువ్వొక్కడివే నా జీవితంలో. ఆనాడు ఉద్యోగంకోసం గత్యంతరంలేక నీ పాపిష్టి చేతుల్లో మలినమైనప్పట్నించీ ఆలోచిస్తున్నాను, నీమీద పగతీర్చుకునే మార్గంకోసం...."

అతనప్పుడు ఉలిక్కిపడ్డాడు. అతనికేదో గుర్తొచ్చింది.

"ఓహ్....అయితే నువ్వా! యేమిటి....యేమిటి బెదిరిస్తున్నావ్?"

"నాకు అయిదు లక్షలు కావాలి."

"ఏమిటీ!"

"అయిదు లక్షలు కావాలి, చిమన్ భాయ్."

"దేనికి?"

"నీ ప్రాణాలు నిలబెట్టుకోడానికి."

"వాటికేమయింది?"

"మూర్ఖుడా, స్నేక్ సొసైటీ గురించి వినలేదా?"

"ఓహ్...." అతను అదిరిపడ్డాడు, ముఖం ఎర్రబడి పోయింది. "హాలో....హాలో! ఏమిటి....ఏమిటి నువ్వనేది!"

"స్నేక్ సొసైటీకి ఉత్తరం రాద్దామనుకుంటున్నాను" అందవతలి గొంతు నింపాదిగా, "నువ్వు డబ్బివ్వకపోతే నే."

అతను బిగుసుకుపోయాడు. ఉద్రేకంగా ఆలోచించాడు. అప్పుడు తేలికపడి తేరుకున్నాడు. ఫకాలున నవ్వి చెప్పాడు. "చూడు బేబీ, నీ ఆటలు కట్టిపెట్టు. యూ ఆర్ ఫూలిష్. ఆ సొసైటీ, వాళ్ళ ప్రకటనలూ అంతా నాన్సెన్స్. నేను డబ్బివ్వను. ఉత్తరం వ్రాసుకో పో! నీలాటివాళ్ళు చాలామంది వున్నారు నాకు. నన్నెలా రక్షించుకోవాలో నాకు బాగా తెలుసు!"

అతనింకోసారి నవ్వి, ఫోన్ పెట్టేశాడు. పొరబడ్డాడని అతనికి తెలియదు.

* * *

"హాలో....సుబ్రమణ్యన్ భాయ్, వడక్కం!"

"వడక్కం!"

"సుబ్రమణ్యన్ భాయ్, నా చెల్లెలు అనిత తరఫున మాట్లాడుతున్నాను."

"ఏం మాట్లాడుతున్నావూ....?"

"నాకిప్పుడే తెలిసింది, నువ్వామెని అల్లరిపెట్టావటగా?"

"ఏమిటి?—హలో—ఎవర్నువ్వు?"

"నా పేరనవసరం, అనిత అన్నని. నువ్వామెని అల్లరిపెట్టింది నిజమా కాదా చెప్పు."

"నీ చెల్లెలు అనితను....అల్లరి పెట్టానా...."

"అవును, సుబ్రమణ్యాన్ భాయ్, నువ్వు కార్లో వస్తూ కాలేజి దగ్గర ఆమెకు లిఫ్ట్ ఇచ్చి వెకిలి పనులు చేశావ్, పదిహేను రోజుల క్రితం. నువ్వేదో పెద్దమనిషనుకుని పొరబడిందట ఆమె....అప్పుడు కేకలు వేయబోతే నువ్వు దింపేసి పారిపోయావు...."

"ఓహ్....నువ్వు..నువ్వు నన్నెలా కనుక్కున్నావ్?"

"అది అనవసరం. నువ్వు తప్పు ఒప్పుకుంటున్నావు కాబట్టి ఇప్పుడు శిక్ష గురించి మాట్లాడుకుందాం. చెప్పు, ఏ శిక్ష కావాలి నీకు—డబ్బిస్తావా? చస్తావా?

"ఏమిటి....ఏమిటీ....!!"

"ఉదయం కరపత్రాలు చూశావా?"

"చూశాను....చూశాను...."

"చెప్పు, యేం చేయమంటావ్?"

"అయ్యో, ఉత్తరం వ్రాయవద్దు!"

"ఎంతిస్తావ్ డబ్బు?"

"ఎంత కావాలి...."

"మూడు లక్షలు, సుబ్రమణ్యాన్ భాయ్, త్రీ లాక్స్."

"అంత ఇచ్చుకోలేను....అంత ఇచ్చుకోలేను...మూడు వేలు."

"అయితే నీకు మూడుతుంది."

"అయ్యో....ఆ పని చేయకు! నా మాట విను.... ఆరు వేలు."

"సరే, ఉత్తరం వ్రాయమంటాను."

"లక్ష తీసుకో, బేటా!"

"నీ ప్రాణాం విలువ నేను కడతాను, సుబ్రమణ్యాన్ భాయ్."

"రామరామ! శివశివా!....మూడు లక్షలు కుశరమా!

పాడు బుద్ధి మనది.... పోదుపుడు కలలలో గాని ఇది.... అలాగే తీసుకో!"

"సిద్ధం చెయ్, రాత్రి ఇంటికొస్తాను."

"వచ్చేయ్! వచ్చేయ్! ఉత్తరం వ్రాయొద్దు మొర్రోయ్!"

"వడక్కం, సుబ్రమణ్యన్ భాయ్!"

"వడక్కం.... వడక్కం...."

ఠపీమని ఫోన్ పడేసి పడిపోయాడు సుబ్రమణ్యన్ భాయ్, నగరంలో నామోషీ ఎరుగని నగల వ్యాపారి.

• • •

ఆఫీసుకు తిరిగివచ్చి జాన్, ఫోన్‌లో కృష్ణతో మాట్లాడి, తీవ్రంగా ఆలోచనలో పడ్డాడు. ఇప్పుడతనికి సరయిన మూడ్ వచ్చింది. నిరుత్సాహం మాయమైంది. ఆ కత్తులకి కట్టివున్న లేబుల్స్‌మీద దస్తూరీ సుహాసిని దేనని ధృవపడినట్లు చెప్పాడు కృష్ణన్. ఆమె ఇంట్లో ఆమె నోట్స్‌ని పరిశీలించాక ఇది వెల్లడించాడట ఎక్స్‌పర్టు.

జాన్, ప్రకాష్‌నగర్‌లో స్నేక్ సొసైటీ అద్దెకి తీసుకున్న మేడ గురించి అడిగాడు. అక్కడ మఫ్టీల్నించి పనికొచ్చే సమాచారమేదీ అందలేదన్నాడు కృష్ణన్. ఆ ఇంటికి ఇప్పటివరకు యెవరూ రాలేదు. ఆ ఇంటికి తాళం అద్దెకి తీసుకున్న పెద్దమనిషే వేసుకు వెళ్ళాడు. ఆ ఇంటి యజమానిద్వారా ఆ పెద్దమనిషి ఆనవాలు స్పష్టంగా తెలియలేదు.

అప్పుడు జాన్, ఆ పెద్దమనిషి ఆ ఇంటి యజమానిని యెలా కాంటాక్టు చేశాడని అడిగాడు. ఒక యెస్టేట్ ఏజెంట్ ద్వారా అని చెప్పాడు కృష్ణన్. ఆ యేజెంట్

గురించి అడిగినప్పుడు, వెంట నే కలుసుకుని చెప్తా న్నాడు కృష్ణన్.

ఫోన్ పెట్టేసి జాన్ ఆలోచనలో పడ్డాడు.

* * *

తలుపు తెరిచి జింబో, నవ్వుతూ చూశాడు లాల్ ని.

"గుడ్ ప్రోగ్రెస్, సర్. మా సోషల్ వర్క్ ఎటు వంటి అంతరాయం లేకుండా జరిగిపోతోంది...."

లోపలికొచ్చి, చేతిలో ట్రేని టేబుల్ పైన వుంచి, చేతులు కట్టుకుని నిలబడ్డాడు. లాల్ అతన్ని సూటిగా చూశాడు. అతనలాగే నవ్వుతున్నాడు.

"ఇంకేమేం జరిగాయి?" అడిగాడు లాల్, అలాగే పడుకుని చూస్తూ.

"నిన్న రాత్రి జరిగిన అయిదు వధింపులు పేపర్లో చూశారుగా, సర్?"

"చూశాను. బాగానే వధించారు."

"వధించింది సర్, సుహాసినీ దేవి. మీరా కరపత్రం చూశారనుకుంటాను?"

"చూశాను. భాష చండాలంగా వుంది."

నవ్వాడు జింబో. "గుడ్ రెస్పాన్స్, సర్. అప్పుడే మాకు మూడువందల ఇరవై నాలుగు ఉత్తరాలందాయి."

లాల్ కళ్ళు చిన్నగా యెగిరిపడ్డాయి. "యెలా అందాయి?"

"మా పద్ధతులు మావి, సర్" మళ్ళీ నవ్వాడు జింబో, "ఆ ఉత్తరాలతో పెద్ద లిస్టు తయారు చేస్తున్నాం, సర్. ఈ రాత్రినుంచే మొదలవుతుంది ఆపరేషన్ ఎరాడికేషన్."

"ఆపరేషన్ ఎరాడికేషన్?"

"అప్రాచ్యులు ఏరివేతక?"

"ఓహ్..." లాల్ ఆందోళనగా అన్నాడు.

"ఫలహారం తీసుకోండి, సర్. చల్లారిపోతోంది...."

లాల్ ట్రేలోకి చూసి, అప్పుడే ఏదో నిర్ణయించుకున్నట్లు చటుక్కున జింబోవైపు తిరిగాడు. ముఖంలో ఆతృతని అణచుకున్నాడు. "ఈ గొలుసు విప్పు, జింబో" అన్నాడు అతి మామూలుగా.

"ఎందుకు, సర్?"

"బాత్ రూం" అన్నాడు లాల్, లేచి కూర్చుంటూ.

"ఓహ్.. ఓకే....ఒక్క క్షణం, సర్...." జింబో తలుపు దగ్గరికి కదిలాడు. అక్కడాగి బయటికి తొంగి చూస్తూ పిలిచాడు, "సంతోష్! సంతోష్! ఇలా వచ్చెయ్యమ్మా."

దబదబమని యెవరో పరుగెత్తుకొస్తున్న చప్పుడు.

"ఏమిటి, జింబో?"

"బాత్ రూం తీసి కెళ్ళాలి గెస్టుని ..." జింబో జేబులోంచి ఒక తాళంచెవి తీస్తూ అన్నాడు, "ఆ తాళం తీయ్....నీ జేబులో గొట్టం ఏదీ, ఇలా ఇవ్వు."

"సంతోష్ రివాల్వర్ తీసిచ్చి, తాళంచెవి తీసుకున్నాడు.

వాళ్ళిద్దరు లోపలికి కదిలారు.

లాల్ గాఢంగా ఊపిరి తీసుకుని వదిలాడు.

సంతోష్ కింద కూర్చుని తాళం తీస్తుంటే, జింబో, లాల్ కి రివాల్వర్ గురిపెట్టి నిల్చున్నాడు. అప్పుడతని ముఖంలో అదివరకటి స్నేహభావం లేదు.

కాట్ నుంచి గొలుసుని వేరుచేశాక దాన్ని లాల్

కాలుతో చుట్టాడు సంతోష్.

"ఓ.కే. సర్. ఇక పదండి" అన్నాడు జింబో, ప్రక్కకొస్తూ.

లాల్ లేచి కింద నిలబడ్డాడు. రెండడుగులు వేసి తూలి మళ్ళీ నిలదొక్కుకున్నాడు. ఇంకో రెండడుగులు జాగ్రత్తగా వేశాడు, కంటి చివరలనుంచి వాళ్ళని గమనించడానికి ప్రయత్నిస్తూ. వాళ్ళిద్దరూ పూర్తిగా వెనుక వున్నారు. అప్పుడు జింబో చేతిలో రివాల్వర్ లాల్ మెడకి ఆనింది చల్లగా. లాల్ భుజాలు ఎగిరిపడ్డాయి.

"జింబో.... నాకు నడక కష్టంగా వుంది.... నేను తూలితే త్వరపడి పేల్చేసేవు!"

జింబో ఇంకా నొక్కాడు రివాల్వర్ని "అలా జరుగదు, సర్."

లాల్ మళ్ళీ తూలాడు అడుగులేస్తూ.

"జాగ్రత్త, సర్ .... జాగ్రత్తగా చూసి తలుపు దాటండి, కింద గడప తగులుంది." జింబో చెపుతూ అడుగులేస్తున్నాడు. పక్కన సంతోష్ తాపీగా నడుస్తున్నాడు.

అప్పుడు మళ్ళీ తూలాడు లాల్, గడప దాటుతూ. సంతోష్ తటాలున వెళ్ళి పట్టుకోబోయాడు. లాల్ వంగి అతన్ని వెనక్కి తోసేస్తూ బయటికి దూకేశాడు. జింబో గట్టి కేకతో ట్రిగ్గర్ లాగేశాడు. లాల్ ధడాలున తలుపులు లాగి మూసేస్తూంటే మళ్ళీ మళ్ళీ లాగేశాడు.... క్లిక్! క్లిక్! క్లిక్!....అంతే.

"ఓహ్, అది లోడ్ చేయడం మర్చిపోయాను, జింబో!" కిందపడ్డ సంతోష్ గొంతు చించుకుని అరిచాడు.

తలుపులు పూర్తిగా మూసుకుని, బయట గొళ్ళెం పడిపోయిందప్పుడే.

• • •

"బ్యాక్ యూ గో!" అన్నాడతను, రివాల్వర్ గురిపెడుతూ.

"లాల్ చేతులెత్తేసి, రెప్పవేయకుండా చూడసాగాడతన్ని.

"బ్యాక్ టు ది రూం, ఐ సే!" గర్జించాడా మనిషి మళ్ళీ పళ్ళు బిగిస్తూ.

విపరీతంగా శబ్దం చేస్తోందా గది తలుపు.

ఒకటే అరుపులు వినిపిస్తున్నాయి లోపలినుంచి.

లాల్ ఓమారు ముందుకూ వెనక్కీ చూశాడు. ఆ పొడవాటి నడవలో ఇంకెవరూ లేరు. యెదుట నిలబడి వున్న మనిషిని మొదటిసారిగా ఇప్పుడే చూస్తున్నాడు. భారీగా, యెత్తుగా, కుడి చెంపమీద కురుపుతో వున్నాడు. వెడల్పాటి కర్కశమైన ముఖం. చేతిలో రివాల్వర్ అతడి కర్కశత్వాన్ని మరింతగా పెంచింది.

అతను నాలుగడుగుల దూరంలోనే వున్నాడు.

ఏ కొంచెం మొరటుగా కదిలినా కాల్చేసేలా వున్నాడు.

లాల్ గదిలోంచి బయటపడి గొళ్ళెం పెడుతూండగానే అతను అవతలి గదిలోంచి ప్రత్యక్షమయ్యాడు.

లాల్ ముఖం నిస్సహాయత ఆవరించుకుంది.

అతడలాగే చేతులెత్తిపెట్టి, కిమ్మనకుండా వెనక్కి తిరిగాడు. అప్పుడు వెనుకనుంచి అడుగులు దగ్గరవుతూ ఒక్కసారి రివాల్వర్ మజిల్ మెడకి తగిలింది చల్లగా. లాల్ వూపిరి పీల్చాడు. తలమీద దెబ్బ పడలేదు!

"కమాన్, బ్యాక్ టు ది రూం!" మరో గర్జన.

"లాల్ మౌనంగా నడిచాడు గని దగ్గరికి.

"ఓపెన్ ది డోర్!"

లాల్ గొళ్ళెం తీసేశాడు. ఆ వెంటనే తలుపుల్ని తటాలున తెరచుకుని వాళ్ళిద్దరు బయటికొచ్చేశారు. వగరుస్తూ.

వెనకనుంచి లాల్ లోపలకు తోయబడ్డాడు. తక్షణం తలుపులు మూసుకున్నాయి.

"బాస్టర్డ్స్! మీకు మెదడుందా? చంపేస్తాను మిమ్మల్నిద్దర్నీ—" నిప్పులు కురిపించాడా మనిషి వాళ్ళిద్దర్నీ చూస్తూ, "ఏం జరిగింది ఫూల్స్? ఏం చేశారిద్దరూ కలిసి?"

జింబో తేరుకున్నాడు. సంతోష్‌ని కోపంగా చూసి ఒక్క కేక వేశాడు, "నేనేం చేయాలి? ఈ పందు కోతి గుళ్ళులేని గొట్టం ఇచ్చాడు నా చేతికి!"

సంతోష్ మండిపడి అతనిమీద కురిశాడు, "నేను కావాలని ఇచ్చానా, నల్లకోతీ! అసలు నీ గొట్టం ఏమైంది?"

"షటప్, యూ ఫూల్స్! మాటలు తిన్నగా వాగండి! మీ తలల్లో పేడ వుంటే గొట్టంలో గుళ్ళెలా వుంటాయి? థాంక్ గాడ్, ఆ డిటెక్టివ్ బయటపడితే మన ఆపరేషన్ గల్లంతయ్యేది! మీవీ నాదీ తోళ్ళు వొలిచి యాసిడ్‌లో పడేసేవాడు బాస్! జాగ్రత్తగా వుండండి, బ్లడీ ఫూల్స్, జాగ్రత్తగా వుండండి!" అరిచి, పెద్ద పెద్ద అంగలేసుకుంటూ కొంత దూరం వెళ్ళి మళ్ళీ తిరిగాడతను, "యూ డమ్మీస్, లాక్ ది డోర్! అండ్ కమ్ విత్ మీ!"

వాళ్ళిద్దరు తేరుకుని గదికి తాళం వేసేశారు. గబగబా

అనుసరించారు శంభూనాథ్‌ని.

"నన్ను నల్లకోతి అంటావా?"

"మరి నేను పండుకోతినా?"

"అవును, నేనలాగే పిలుస్తాను!"

"నువ్వూ అలాగే పిలిపించుకో!"

"నోర్మూయ్యండి, కోతుల్లారా! కాల్చిపారేస్తాను లేకపోతే!"

వాళ్ళు నోర్మూసుకుని నడిచారు.

కాలికి గొలుసుతో గదిలో స్వేచ్ఛగా వదిలివేయబడ్డ లాల్, కాట్ మీద కూర్చుని అక్కడున్న తాళాన్నీ, తన కాలికి గొలుసునీ పదేపదే చూసుకుని, చిన్నగా భుజాలెగరేసి, గొలుసుని కాట్ కోడుకి చుట్టి తాళం వేసేసి, తాళంచెవిని పరుపుకింద పెట్టుకుని, గమ్మున పడుకున్నాడు.

• • •

ఆ సాయంకాలం సంచలనం రేపాయి పత్రికలు—

సుహాసిని ఫోటోలతో, ఆమె వేటకి గురికాబోయే వాళ్ళకి హెచ్చరికలతో, వాళ్ళ రక్షణకు పోలీసులు తీసుకుంటున్న జాగ్రత్తలతో, స్నేక్ సొసైటీకి పోస్టయిన ఉత్తరాల్ని స్వాధీనం చేసుకున్న వివరాలతో నిండిపోయాయి—

ఉత్తరాలు వ్రాసిన అనేకమంది, పత్రికల్లో పోలీసుల సూచనలు చూసి బెదిరిపోయారు. తమ వివరాలు తాము చంపించబోతున్న వ్యక్తులే పోలీసులకి అందించగలరనే సరికి వాళ్ళలో భయం పుట్టుకొచ్చింది. కానీ తర్వాత ఆ ఉత్తరాలు పోలీసుల స్వాధీనమయ్యాయనేసరికి తేలిక పడ్డారు — అవి సొసైటీకి చేరలేదు, బ్రతికాం అను

కున్నారు.

వాళ్ళిప్పుడు పూర్తిగా పారబడ్డారు.

వాళ్ళతోపాటు పోలీసులు కూడా.

పోలీసులతోపాటు వేటకు గురికాబోయే వాళ్ళు కూడా.

తాము పోలీసులకి వివరాలందిస్తామనే భయంతో సొసైటీకి ఇక యెవరూ ఉత్తరాలు వ్రాయరనుకుంటున్నారు వాళ్ళు. ఇది నిజమే. అయితే సొసైటీకి ఇప్పటికే మూడువందల పై చిలుకు ఉత్తరాలందిపోయాయని తెలియదు వాళ్ళకు. వాటన్నిటినీ పోలీసులు స్వాధీనపర్చుకున్నారనే భ్రమతోనే వున్నారు వాళ్ళంతా.

పోలీసులు కూడా తమకు దొరికిన ఆ ముఖ్యరెండు ఉత్తరాలే మొత్తం పోస్టయిన ఉత్తరాలనుకుంటున్నారు.

ఇలా వుండగా సాయంత్రం ఆరుగంటలకి ఫోన్ వచ్చింది జాన్‌కి, కృష్ణన్ నుంచి. అతను కోరిన ఎస్టేట్ ఏజెంట్ వివరాలందించాడు.

జాన్ అడ్రసు తీసుకుని వెళ్ళాడు ఏజెంట్ కోసం. అబిడ్స్‌లోని రెండంతస్తుల బిల్డింగ్‌లో పైన వుంది అతని ఆఫీసు. ఆ ఏజెంట్ తనదగ్గరకొచ్చిన 'పెద్దమనిషి'ని వర్ణించి, అతను వారంక్రితమే తనవద్దకొచ్చి ఒక మంచి బంగళాను చూసిపెట్టమని కోరినట్టు చెప్పాడు. ఫీజు కూడా అప్పుడే చెల్లించాడు. ఆ మనిషికి ఇల్లు దొరికితే తనని కాంటాక్టు చేయడానికి ఫోన్ నెంబర్ కూడా ఇచ్చి వెళ్ళాడు. ఆ నెంబర్ చెప్పాడు ఏజెంట్.

జాన్ దాన్ని వెంటనే కృష్ణకి పాస్ చేశాడు.

అప్పటికి చీకటి పడిపోయింది ...

ఆ సమయంలో పోస్టల్ డిపార్టుమెంట్ కాని

డిపార్టుమెంట్ వాళ్ళు మరో రెండు పూర్తిచేశారు.

సాయంకాలం లాస్టు క్లియరెన్స్ తర్వాత, పత్రికలు వెలువడడానికి ముందూ, పోస్టయిన మరికొన్ని ఉత్తరాలు వాళ్ళ హస్తగతమయ్యాయి.

అవన్నీ పోలీసుల స్వాధీనమయ్యాయనుకుంటున్నారు లేఖకులు.

• • •

ఆ కారు వేగంగా పరుగెడుతోంది నగరవీధుల్లో...

అది వైట్ అంబాసిడర్.

సమయం అర్థరాత్రి దాటింది, డ్రైవ్ చేస్తున్న ఆమెలో ఎలాంటి తొందరపాటు, భయాందోళనలు లేవు. వెనుక చూపుల్లేవు. ఆమె తాపీగా డ్రైవ్ చేస్తోంది. ఆమె దృక్కులు తిన్నగా రోడ్డుమీద వున్నాయి. ఆ కళ్ళలో ధృడనిశ్చయం, పరిణామాలపట్ల నిర్లిప్తతా స్పష్టంగా ద్యోతకమవుతున్నాయి....ఆమె ముఖం ఏ భావాలూ ప్రతిఫలించని శిలలా వుంది. తనదైన ఒకేఒక్క లక్ష్యంతో గమ్యానికి ఆమె సాగిపోతోంది.. ఆమెకే అడ్డంకులూ లేవు.

కారుని ఖైరాతాబాదులోని ఓ విశాలమైన వీధిలోకి తిప్పి ఆపింది. నిదానంగా దిగి, హేండ్ బ్యాగ్ తీసుకుని చకచక నడవసాగింది. అప్పుడామె తెల్లని దుస్తులు, వదులు జడ, బోసిగా వున్న మెడ, చేతులు, బొట్టులేని నుదురు, నడకతీరూ, హావభావాల్నీ చూస్తే — అంత రాత్రి ఎవరైనా ఇట్టే జడుసుకుంటారు.

ఆమె ఒక మేడ ముందు కెళ్ళి తక్కున ఆగిపోయింది. గూర్ఖా గేటు అవతలనుంచి తొంగిచూశాడు. సాబ్ హై? ఆమె ప్రశ్న. అతను వున్నట్లు తలూపాడు. ఆమె బ్యాగు

లోంచి కర్చీఫ్ తీసి అతని ముక్కుకు పెట్టింది. అతను తల తిరిగి కిందపడ్డాడు. ఆమె గేటు తీసుకుని లోపలికి నడిచింది.

గబగబా వెళ్ళి, పోర్టికోలోంచి వరండా ఎక్కి బెల్ నొక్కింది.

ఇల్లంతా చీకటిగా, చడీ చప్పుడు లేకుండా వుంది.

లోపలెక్కడో మోగింది బెల్.

సమాధానం రాలేదు.

ఆమె మళ్ళీ నొక్కింది.

అప్పుడు అడుగులు వినిపించాయి. తలుపు తెరచుకుంది.

అతను కలవరంగా చూశాడామెని. "యెవరు ... యెవరు? యెవరు కావాలి?"

ఆమె చొరవగా లోపలికెళ్ళిపోయింది.

"సేట్ చిమన్ భాయ్, నన్ను గుర్తుపట్టలేదా?" అడిగిందామె, అతని ముఖంలోకి తీక్షణంగా చూస్తూ.

అతను భయపడి ముఖం తిప్పుకున్నాడు.

"ఎవరు? నువ్వు....నువ్వెవరు?"

"నా ఫోటో పత్రికల్లో వచ్చింది."

అతను వెనక్కి జరిగిపోయాడు నోరు తెరుస్తూ, "సుహాసినీ!?"

"అవును. ఇక ఎందుకొచ్చానో వూహించగలవు. మోహినీ యామినీ నీ మీద ఉత్తరాలు వ్రాశారు."

"గాడ్!" అతను గుండెలు పట్టుకున్నాడు, "మీ కప్పుడే ఎలా అందాయి?"

"మాకు అందుతాయి, ఎప్పటికప్పుడు."

ఆమె గాజు పెంకుల్లాంటి కళ్ళు భయం గొలిపేలా మెరుస్తున్నాయి.

అతనికి చెమటలు పడుతున్నాయి, వెర్రివాడిలా చూస్తున్నాడు.

ఆమె ముందుకు కదిలింది ఇంకా కఠినంగా చూస్తూ, "ఆమెని పరిహసించావట, మోహినిని? నిన్ను నీవు రక్షించుకోగలనన్నావట?..బహుశ నేనివ్వాళే వస్తానని వూహించి వుండవు....బందోబస్తు చేసుకోలేదు. మంచి పని చేశావు, నా పని సులువైంది. ఇదిగో కత్తి.... దింపుకో గుండెలో...."

ఆమె బ్యాగులోంచి కత్తి తీస్తోంటే, "నో!" అని అరిచాడతను.

ఆమె విసురుగా కదిలి అతని గుండెలో దింపేసింది.

"నీలాంటి కుక్కకి ఇదే గతి!"

ఆమె లాగి మళ్ళీ దింపింది....అదే రంధ్రంలో, కత్తిని.

• • •

చటుక్కున కళ్ళు తెరిచి చూశాడు లాల్.

నిజంగా నే నిద్రపోయాడు! ఎంత సేపయింది? వాచీ చూసుకుని ఉలిక్కిపడ్డాడు. వెంటనే లేచి గదిలో చుట్టూ చూశాడు. ఎప్పటిలాగే వుంది. మార్పు ఏమీ లేదు. కాలికి బంధం చూసుకున్నాడు. పరుపుకింద తాళం చెవి గుర్తొచ్చింది. వెంటనే దాన్ని తీసి ఆత్రుతగా చూసుకున్నాడు. దాన్నలాగే చూస్తూ దృష్టిని కేంద్రీకరించి ఆలోచనలో పడ్డాడు....

అప్పుడేదో ఆలోచించుకున్నట్లు తలూపి, దాన్ని తిరిగి యథాస్థానంలో పెట్టేసి పడుకున్నాడు. నెమ్మదిగా తల తిప్పి టేబుల్ మీద గాజు జగ్గుని చూశాడు. అందులో సగంవరకు నీళ్ళు కన్పిస్తున్నాయి. దాన్ని అందుకోబోతూ కావాలని కిందికి తోసేశాడు

ఫెళ్ళున పెద్ద చప్పుడు.

బయట వేగంగా అడుగుల చప్పుడు.

అప్పుడు తాళం తీస్తున్న అలికిడి.

తలుపు తెరచి సంతోష్ రివాల్వర్ గురిపెట్టాడు. గదిలో ఓమారు చూసి, లాల్ కాలికి బంధం ధైర్యమివ్వగా లోనికి అడుగుపెట్టాడు. లాల్ చెప్పకనే అతని దృష్టి నేలమీదపడి జరిగింది గ్రహించాడు.

లాల్ ఆందోళనగా చూస్తున్నాడు, కింద ముక్కలైన జగ్గుని.

"మంచినీళ్ళకోసం అందుకోబోతే...."

"మీకు మంచినీళ్ళు కావాలా?"

"దాహం బాగా వేస్తోంది."

"ఓ.కే, వన్ మినిట్!" అతను వెనక్కి తిరిగి బయటికి నడిచాడు. లాల్ గబగబా తాళంచెవి తీసి, గొలుసు తాళం విప్పేశాడు. కిందికి దిగి గొలుసుని కాలికి చుట్టేసుకుని తాళాన్ని చేతిలో తీసుకున్నాడు. ఒక్క గంతులో తలుపు దగ్గరకెళ్ళి బయటికి చూశాడు. సంతోష్ ఇంకో జగ్గుతో వస్తూ కనిపించాడప్పుడే.... లాల్ తలుపు పక్కకు జరిగిపోయి, గోడకతుక్కుని నిలబడ్డాడు, తాళాన్ని గట్టిగా పట్టుకుంటూ.

అప్పుడు అడుగులు దగ్గరయ్యాయి.... సంతోష్ నిస్సంకోచంగా లోపలికొచ్చేశాడు. కుడిచేతిలో రివాల్వర్, ఎడమ చేతిలో నీళ్ళ జగ్గుతో. అతను రెండడుగులు లోపలికి వేసి, ఒక్కసారి అదిరిపడి వెనక్కి తిరగబోయాడు.

వెనకనుంచి తలమీద గట్టి దెబ్బపడింది—

జగ్గుని వదిలేస్తూ గిర్రున తిరిగాడు రివాల్వర్‌తో.

మరో దెబ్బ పడింది తలమీద.

బాధతో కళ్ళు మూతపడి గట్టిగా మూల్గాడు, రివాల్వర్ ఎగిరిపోయింది. అతనిమీదికి లంఘించి మరో దెబ్బ వేశాడు లాల్, తాళంతో. ఇద్దరూ కిందపడ్డారు, గాజు పెంకులకి కొంచెం దూరంలో.

అప్పుడు లాల్ మరో దెబ్బ వేశాడు, శక్తినంతా కూడదీసుకుని.

* * *

ఆ కారు చార్మినార్ వైపు ఓల్డ్ సిటీ ఇరుకు వీధుల గుండా సాగిపోయింది. ఆమె చాలా ప్రశాంతంగా డ్రైవ్ చేస్తోంది. ఒకసారి టైము చూసుకుని, వేగం ఇంకా పెంచింది. కొన్ని వీధులు తిరిగి, ఓ పురాతన కట్టడంముందు కారాపి దిగింది.

"ఆ వీధిలో ఎవరూ తిరగడంలేదు, అంత రాత్రివేళ ఆమె నిర్భయంగా అడుగులేయసాగింది. ఆమె అడుగులు ఒక లయప్రకారం పడుతున్నాయి సిమెంటు రోడ్డుమీద. ఆ ఇంటి మెట్లెక్కి ఆమె గొళ్ళెంతో తలుపుమీద కొట్టింది. జవాబులేదు. అప్పుడు మళ్ళీ కొట్టింది. ఎవరిదో దగ్గు, ఆ తర్వాత ఒక మగ గొంతు వినిపించాయి.

అతను తలుపు తీసి కళ్ళు నులుముకుంటూ చూశాడు.

"అక్తర్ హుస్సేన్?" అడిగిందామె తీక్షణంగా చూస్తూ.

తలూపాడతను, అవునన్నట్లు.

ఆమె చొరవగా లోపలికి వెళ్ళింది. ఆ ముందు గదిలో ఎవరూ లేరు.

అతను కలవరపడి చూశాడు, "కౌన్ .... కౌన్ హై ఆప్?"

"సుహాసిని, స్నేక్ సొసైటీ."

అతను తృళ్ళిపడ్డాడు. "సుహాసినీ! తుమ్ సుహాసినీ?"

"అవును—" తలూపిందామె, "నీమీద ఉత్తరం వచ్చింది. నువ్వు నీ విధవరాలు వదినని వేధిస్తున్నావట?"

అప్పుడామె చేతిలో కత్తిని చూశాడతను. వంకర తిరిగి వాడిగా ఆ లైటు వెలుగులో తళుక్కున మెరుస్తోంది. "ఏమిటి....ఏమిటి....నువ్వేం చేస్తున్నావ్?" అతను చేతులడ్డం పెట్టాడు, "నేను వేధించలేదు! నేనేం చేయలేదు! పొరబడ్డావు!"

"జులేఖా బేగం వ్రాసింది."

ఆమె ముందుకు కదిలింది కత్తితో.

అతను పారిపోతూ కెవ్వున "బచావో! బచావో!" అని అరిచాడు.

ఆమె పట్టుకుని గుండెలో దింపేసింది కత్తిని.

వెనుక గదిలో అలికిడవుతోంటే చటుక్కున ఆ గది తలుపు గొళ్ళెం పెట్టేసి, లాగి మళ్ళీ దింపింది కత్తిని అదే రంధ్రంలో.

అతను కింద విరుచుకుపడ్డాడు, రక్తం ప్రవహిస్తోంటే.

ఆమె బయట కురికింది, ఇంట్లోంచి అరుపులు వినిపిస్తోంటే.

* * *

అతనిమీదనుంచి లేచి లాల్, గబుక్కున తలుపులు మూసి గడియపెట్టేశాడు.

కాట్ దగ్గరికి వెళ్ళి దానిమీద బెడ్ షీట్ ని లాగేశాడు. దాన్ని పేలికలుగా చింపి అతని కాళ్ళు చేతులు కట్టేశాడు. నోట్లో కుక్కాడు. రివాల్వర్ తీసుకున్నాడు.

అప్పుడు తలుపు తీసి బయటికి చూశాడు. యెవరూ

లేరు. ఒక లైటు వెలుగుతోంది. బయటకొచ్చి తలుపులు మూసి తాళం వేసేశాడు. రివాల్వర్ పట్టుకుని బూట్లు శబ్దం చేయకుండా చిన్నగా ముందు గదులవైపు నడిచాడు. మొదటి గదిలో ఎవరూ లేరు. రెండు మంచాలున్నాయి. ఆ తర్వాత గదిలో కూడా ఎవరూ లేరు. అదే చివరి గది. తలుపులోంచి అవతల పరిసరాలు కనిపిస్తున్నాయి, చీకట్లో అస్పష్టంగా. అతనింకో రెండడుగులు వేసి తలుపు ప్రక్కన చేరాడు. బయటికి చూశాడు....అప్పుడే ఓ ఆకారం ముంగిట్లో తచ్చాడుతూ వుండడం చూశాను. అది సిగరెట్ తాగుతోంది.

లాల్ కాలు వెనక్కి చాపి, లాగి తన్నాడు తలుపు రెక్కని.

అది ఫటేలున మూసుకుని, మళ్ళీ తెరచుకుంది చటుక్కున.

ఆ శబ్దానికి ఆ ఆకారం ఇటు మళ్ళి చూసింది. లాల్ మళ్ళీ అలాగే తన్నాడు. తలుపు మళ్ళీ ఫటేలున మూసుకుని మళ్ళీ తెరచుకుంది.

ఆ ఆకారం సిగరెట్ పారేసి గబగబా రాసాగింది. అడుగులు దగ్గరవుతూంటే లాల్ ఇంకోసారి తన్నకుండా వుండిపోయాడు గోడకతుక్కుని, రివాల్వర్‌ని సిద్ధంగా తిప్పిపట్టుకుని.

ఆ ఆకారం లోనికి అడుగుపెడుతూ, "ఏమయింది, సంతోష్? తలుపునెందుకు తంతున్నావ్?" అంది.

వెనకనుంచి లాల్ దానిమీద విరుచుకుపడ్డాడు.

కిందపడబోసి రివాల్వర్‌తో తలమీద మోదాడు. ఓ గట్టి మూల్గు మూల్గి అచేతనమయిపోయిందా ఆకారం.... ఒక్క ఉదుటున లేచి నిలబడ్డాడు లాల్. అదే క్షణంలో

అతను కొయ్యబారిపోయాడు....

దూరంగా హెడ్ లైట్లు కన్పిస్తున్నాయి, దగ్గరవుతూ వేగంగా.

• • •

"నువ్వ్-నువ్వు సుహాసినివా?" అన్నాడతను పాక్ తిని.

తలూపిందామె, కారు డ్రైవ్ చేస్తూ. కారు అమీర్ పేటనుంచి పంజగుట్టవైపు వస్తోంది.... మెయిన్ రోడ్స్ మీదుగా గాకుండా చిన్న చిన్న వీధుల్లోంచి వస్తోంది.

అతను బెదిరిపోతూ సీటు చివరికి జరిగాడు. "నన్ను-నన్నెక్కడికి తీసికెళుతున్నావ్!"

ఆమె చెప్పింది అలాగే డ్రైవ్ చేస్తూ, "నీ ఇంట్లో జనాభా ఎక్కువ వుంది. అక్కడ వీలుపడదు. అందుకని ఒక చిన్న అబద్ధంతో నిన్నిలా తీసికొస్తున్నాను...."

"ఎక్కడికి తీసికెళ్తావు? ఏం చేస్తావు? కారాపు!"

"నువ్వు రాధారాణితో స్వర్గం చూశానని సంబర పడిపోయావు కదూ? ఇప్పుడు నే చూపించే స్వర్గాన్ని చూడు...."

ఆమె వేగం తగ్గిస్తూ, ఎడమచేత్తో కత్తిని అతని గుండెలో దూసింది.

అతను గుండెపట్టుకుని డోర్ మీదకు ఒరిగిపోయాడు. ఆమె కత్తిని మళ్ళీ అదే రంధ్రంలోకి బలంగా దూసి, డోర్ తెరచి అతన్ని కిందకి తోసేసింది.

తిరిగి వేగం పెంచి దూసుకెళ్ళిపోయింది.

• • •

కృష్ణన్ నుంచి ఫోన్ నెంబరుగల అడ్రసు తీసుకుని, జాన్ విద్యానగర్ లో ఒక ఇంటిముందు కారాపి దిగాడు.

అప్పుడు ఏడున్నరవుతోంది సమయం, రాత్రి.

అతను సందేహంగా జేబులో రివాల్వర్ని తడుము కుంటూ వెళ్ళి తలుపు కొట్టిన కొన్ని క్షణాలకి వచ్చి తీసిందొక స్త్రీ.

ఆమెకు యాభై ఏళ్ళుంటాయి.

జాన్ ఆమెనూ, ఆమె వెనుక ఇంట్లో పరిసరాల్ని గమనిస్తూ, "బాలరాజ్ ఇల్లు ఇదేననుకుంటాను?" అన్నాడు.

ఆమె తలూపింది, ఒక్కసారి ఆతృత చెందుతూ.

కానీ అతను యింట్లో లేడని చెప్పింది.

రెండు రోజుల్నుంచీ రావడం లేదంది. ఏ కబురూ ఇంతవరకు లేదంది. ఏమయిపోయాడో తెలియక దిగులు చెందుతున్నట్టు చెప్పింది. తనెవరని జాన్ని అడిగింది. భర్తతో ఏం పని? తనకు అతను కన్పించాడా?

లేదని చెప్పి జాన్, ఆమె భర్త ప్రకాష్నగర్లో తన మేడ అద్దెకి తీసుకున్నట్టూ, అందులో ఎప్పుడు దిగుతున్నారో తెలుసుకోడానికి తను వచ్చినట్టూ వివరించాడు.

ఆమె కలవరంగా చూసింది. మేడ అద్దెకి తీసుకున్నాడా? దేనికి? తనతో ఏమీ చెప్పలేదే? ఆమె సందేహాలు తను తీర్చలేనని చెప్పి జాన్, అతన్ని అత్యవసరంగా కలుసుకోవాలని కోరాడు. భర్త జాడ తనకేమీ తెలియదందామె. తను యింటికి రాకపోతే తన కోసం ఎక్కడా వెతకవద్దంటూ భర్త చెప్పినట్లు వివరించిందామె.

అప్పుడు — అతనికోసం యింటికెవరొస్తుంటారని అడిగాడు జాన్.

ఎవరూ రారని చెప్పిందామె. అతనికేదేనా వెహి

కల్ వుందా అనే ప్రశ్నకు లేదని జవాబు. నడిచే వెళ్ళాడు ఇంటినుంచి. ఇంటికి ఫోన్స్ ఎవరైనా చేసుంటారా అనడిగినప్పుడు, ఈ రెండు రోజుల్నుంచీ ఎవరూ చేయడంలేదని విచారంగా అందామె. ఎవరు చేసుంటారని అడిగితే, తనకు శంభూనాథ్ పేరొక్కటే తెలుసునని చెప్పింది.

అతనెవరో తెలియదు. తను చూడలేదు. ఎప్పుడూ ఇంటికి రాలేదు. ఎక్కడుంటాడో, ఏం చేస్తాడో వివరాలు కూడా తెలియవు. భర్త ఏం చేస్తాడో, ఎలా సంపాయిస్తాడో చెప్పడు. కానీ తననీ పిల్లల్నీ ఏ లోటు రాకుండా చూసుకుంటాడు.

బాలరాజ్ గురించి ఇంకా అడుగుతూ అతని ఫోటో కావాలన్నాడు జాన్. ఆమె అనుమానంగా చూసింది. అది గ్రహించి తనను కలుసుకున్న బాలరాజ్ ఇతను ఒక్కడేనా సందేహం తీర్చుకోవాలన్నాడు జాన్. పొరబడి రాంగ్ అడ్రసుకు రాలేదు కదా? ఆమె తేరుకుని ఫోటో లేదంది ఇంట్లో. అతను ఇంటినుంచి వెళ్ళినప్పుడు ఏ దుస్తుల్లో వున్నాడో చెప్పమన్నాడు జాన్. ఆమె చెప్పింది. తెల్ల షర్టు, బూడిద రంగు ప్యాంటు, అదే రంగు రెయిన్ కోటుతో....

జాన్ ఉద్రేకపడ్డాడు. అణచుకున్నాడు. అతనికా రెయిన్‌కోటు మనిషి స్ఫురించాడు. సుహాసినికోసం ఆ రాత్రి తమమీద దౌర్జన్యం జరిపిన మనిషి! చంద్రాయణ గుట్ట ప్రాంతంలో మొన్న వళ్ళు కాలి చచ్చిపడున్న మనిషి!

అతనే ఆమె భర్త బాలరాజ్. భర్త చావు ఈమెకింకా తెలియదు. దాన్ని గోప్యంగా వుంచారు పోలీసులు.

అతడిని అతడి గ్యాంగ్ మనుషులే తగులబెట్టివుంటారు. అందుకే ఈ మెను కాంటాక్ట్ చేయడంలేదు శంభూనాథ్ గానీ, మరెవరూగానీ—బాలరాజ్ కోసం సంబంధాలు తెంచుకున్నారు ఇక్కడ్నించి.

జాన్ సానుభూతిగా చూశాడామెను. ఆ దుర్వార్త చెప్పాలా వద్దా అని ఆలోచించాడు. అది కృష్ణన్‌కే వదిలేస్తే మంచిదనుకుంటూ కదిలాడక్కడ్నించి, ఆమె దగ్గర సెలవుతీసుకుని.

జాన్ తిన్నగా ప్రకాష్‌నగర్ వెళ్ళి, అక్కడ సొసైటీ అద్దెకి తీసుకున్న మేడముందు కారాపాడు. అక్కడ డ్యూటీ మారిన మఫ్టీ పోలీసులు అతనివద్ద కొచ్చారు. వాళ్ళేమీ ప్రోగ్రెస్ లేదన్నారు. ఇంటివైపు ఎవరూ రాలేదన్నారు. సాయంత్రం క్రైం బ్రాంచి పార్టీ వచ్చి ఇంటిని సోదా జరిపి వెళ్ళిందని చెప్పారు, తాళం తెరిచి. కానీ ఇంట్లో ఏమీలేదు. ఫర్నీచరు కూడా లేదు. పూర్తిగా ఖాళీగా వుంది.

జాన్ అక్కడ్నించి తిన్నగా తమ ఇంటికి సాగిపోయాడు.

అప్పుడు తొమ్మిదవుతోంది సమయం.

ఇంట్లోకెళ్ళగానే కృష్ణన్‌కి ఫోన్ చేసి, అతనిచ్చిన అడ్రసువద్ద తను తెలుసుకున్న విషయాలు చెప్పాడు. ఆ రెయిన్‌కోటు మనిషే బాలరాజ్ అనీ, అతని ఇంటిని కనిపెట్టమనీ కోరాడు. ఇంకా స్నేక్ సొసైటీకి అద్దెకిచ్చిన ఇంటి యజమానినీ, దాన్ని ఇప్పించిన ఎస్టేటు ఏజెంట్‌నీ జాగ్రత్తలో వుండాలని హెచ్చరించి, అవసరమయితే వాళ్ళకి సెక్యూరిటీ కట్టించమని చెప్పాడు.

అప్పుడు ప్రస్తుతం తనేం చేస్తున్నాడో స్పష్టంగా

వివరించి, తర్వాత మళ్ళీ ఫోన్ చేస్తానని చెప్పి పెట్టేసి, గబగబా సేఫ్ దగ్గరికి వెళ్ళాడు.

దాన్ని తెరిచి, అందులో దాచిన ఫిల్మ్ రోల్ ని తీసుకుని వేగంగా ఆఫీసుకెళ్ళిపోయాడు.

ఆఫీసులో అతను వెనుక గదిలో ఏర్పరచుకున్న చిన్న పార్టిషన్ లోని డార్క్ రూంలో దాదాపు గంటసేపు వుండిపోయాడు, ఆ ఫిల్మ్ తో.

పదిన్నరకు మూడు ఫోటోలు పట్టుకుని వెలుపలి కొచ్చాడు.

అవన్నీ నిన్న మూడు హత్యాస్థలాల్లో తీసినవి, ఆగంత కులవి. వాటిలో ఆగంతకుల్ని గుర్తించి వాళ్ళ తలల్ని స్కెచ్ పెన్నుతో చుడుతూ, సిగరెట్ వెల్గించి ఆలో చించసాగాడు.

జాన్ సిగరెట్ వెల్గించి సరిగ్గా ఆలోచించలేదు. దాన్ని పారేసి ఆఫీసు మూసేసి, తిరిగి బయల్దేరాడా ఫోటోలతో.

స్టేడియం రోడ్ లో డ్రింక్ మోర్ బార్ ముందు కారాపి దిగి తలుపు కొట్టాడు. అక్కడున్న కాపలా పోలీసుల్ని విష్ చేశాడు.

కిషోర్ తలుపు తీశాడు.

జాన్ లోపలికెళ్ళగానే ముఖేష్, రఫీ కూడా వచ్చి విచారంగా నిలబడ్డారు.

బరోడానుంచి దారువాలా తమ్ముడింకా రాలేదని చెప్పారు వాళ్ళు.

జాన్ ముఖేష్ తో అన్నాడు. "ముఖేష్, నువ్వో నల్ల మనిషితో మరొకడు ఇక్కడికి వస్తూండడం చూశా నన్నావు కదూ మొన్న?"

"అవును, సాబ్."

"అతన్ని గుర్తుపడతావా?"

"గుర్తుపడతాను, సాబ్."

జాన్ ఫోటోలు తీశాడు. వాటిని ముఖేష్‌కిచ్చాడు. ముఖేష్ ఆ మూడింటినీ చూస్తోంటే, "గుర్తుపెట్టిన ముఖాలు చూడు!" అన్నాడు జాన్.

"ఇతనే, సార్!" అన్నాడు ముఖేష్ ఉద్రేకంగా.

జాన్ ఆ ఫోటో తీసుకుని చూశాడు. ఆ మనిషి ఓల్డు సిటీలో తప్పించుకుంటూ హాతుడైన ఆగంతకుడు.

"అతన్ని రెండుసార్లు చూశాను, సాబ్. కొద్ది రోజుల క్రితమే మధ్యాహ్నం పూట వచ్చి ఒక కేసు విస్కీ పట్టుకెళ్ళాడు! ఇప్పుడు గుర్తొచ్చింది!"

"ఎక్కడికి?"

"తెలియదు. కానీ స్విహూనగర్ కని చెప్పాడు ఆటోవాడితో. ఆ కేసుని నేనే తీసుకెళ్ళి ఆటోలో పెట్టాను—"

జాన్ అక్కడ్నించి కదిలాడు రెండు నిమిషాల తర్వాత. కారులో వేగంగా స్విహూనగర్ చేరుకున్నాడు, బేగం పేట దాటి.

అప్పటికి బాగా రాత్రయింది.

ఒక వీధిలో అతను కారు దిగి, జేబులోంచి ఆ ఫోటోగ్రాఫ్ తీసి పట్టుకున్నాడు. ఆ వీధిలో చాలావరకు మేడలున్నాయి. వాటిని చూసుకుంటూ వెళ్ళసాగాడు.... అవన్నీ అంధాకారంలో వున్నాయి. అంతా నిశ్శబ్దంగా వుంది. కానీ ఒక మేడలో లైట్లు వెలుగుతూ కన్పించాయి. జాన్ అక్కడ సందేహిస్తూ నిలబడ్డాడు ఫోటో పట్టుకుని. లోపల ఎవరూ కన్పించలేదు. గేటు మూసివుంది.

అతను గేటుమీద చప్పుడు చేశాడు.

ఎవరో లోపలినుంచి వస్తూ కన్పించాడు.

అతను గేటు తీయకుండానే జాన్ని ఎగాదిగా చూడసాగాడు, "ఎవరు కావాలి?"

జాన్ అతడికో ఫోటో చూపించి, అందులోని మనిషి. ఈ ప్రాంతాలా వుంటాడా అని అడిగాడు.

ఆ మనిషి టార్చివేసి ఫోటోని చూశాడు. వెంటనే టార్చి ఆర్పేసి గేటు తీశాడు. "ఇతన్ని చూశాను. ఆ ఎదురు వరుస ఆరో ఇంట్లో వుంటాడు" అని బయటికొచ్చి చూపించాడు.

జాన్ అటు తల తిప్పాడు.

వెంటనే అతను తల పట్టుకుని కూలిపోయాడు.

"నువ్విచ్చిన అడ్రసు కరెక్టే, మిస్టర్ జాన్!" అన్నాడు మనిషి టార్చి జేబులో పెట్టుకుంటూ.

• • •

హెడ్ లైట్స్ని చూసి లాల్ ఒక్కక్షణం కొయ్యబారాడు.

అవి దగ్గరయిపోతూంటే తలుపు మూసేసి, ఆ ఆకారాన్ని ఎత్తుకుని పరుగుతీశాడు చివరి గది దగ్గరికి. తాళం తీసి, అతన్ని గదిలో కిందపడేసి, తిరిగి మూసేశాడు యెప్పటిలాగే.

అతను తాళం వేస్తున్న క్షణాలోనే ఇంటిముందు వచ్చి ఆగింది మెటడార్ వ్యాను. అతను మధ్య గదిలోకి వస్తూ అది చూసి పక్కకు తప్పుకుని తలుపు చాటుకు నక్కాడు. వ్యాన్ డోరు తెరచుకుందప్పుడు. ఒక ఆకారం కిందికి దిగింది. అదింకా దేన్నో కిందికి దించింది. దాన్నెత్తుకుని రాసాగింది గబగబా....

లాల్ వేగంగా అటూ ఇటూ చూశాడు. ఎడమవైపు మంచాలు కన్పించాయి. వాటికింద చోటువుంది. అతనటు వైపు వురుకుతూ ఇంకోసారి ముందు గదిలోకి చూశాడు. అప్పుడే లోపలికొచ్చిన ఆ మనిషి లైటు వెలుగులో స్పష్టంగా కన్పించాడు. జింబో. అతని చేతిలో ఒక అల్యూమినియం ట్రంకు వుంది.

"సంతోష్! .... సంతోష్! .... పండుకోతీ! .... కమానమ్మా!" పిలుస్తూ రాసాగాడు. లాల్ మంచాలకింద దూరి బోర్లా పడుకుని చూడసాగాడు, రివాల్వర్ గురిపెట్టి పట్టుకొని.

జింబో ఆ గదిలోకొచ్చి, మంచాలమీద చూసి, మళ్ళీ అరిచాడు. "సుభాష్! సంతోష్! కమాన్ కిడ్స్! ఎక్కడున్నారు....వచ్చేయండమ్మా! మన ఆపరేషన్ ఓపెనింగ్ పార్టు ఘనంగా సక్సెసయిందోచ్!"

అరుచుకుంటూ వెనుకకు వెళ్ళిపోయాడు. చిన్న నడవ దాటి తాళం వేసివున్న ఆ చివరిగది ముందాగి, కసురుకుంటూ మళ్ళీ వెనుదిరిగాడు.

"బాస్టర్డ్స్, మళ్ళీ బ్రోతల్స్ కెళ్ళిపోయారన్నమాట, ఇల్లు వదిలేసి! మై గాడ్! శంభూనాథ్ రాకపోవడం మంచిదైంది! లేకపోతే షూట్ చేసి పారేసేవాడు నన్ను ఇలాంటి శిష్యుల్ని పెట్టుకున్నందుకు! ఆ రాస్కెల్స్నిరానీ, బూతులు తిడతాను! రేపుదయమే ఆ గుడిసెల్లోంచి...."

"పెట్టె కిందపడేసి చేతులెత్తు, జింబో."

మధ్య గదిలోకి రెండడుగులు వేసినవాడల్లా కొయ్యబారి నిలబడిపోయాడు — వెనుకనుంచి ఈ మాటలూ మెడకేదో చల్లగా తగిలేసరికి.

"జింబో, పెట్టె పడేసి చేతులెత్తెయ్యి!"

మళ్ళీ హెచ్చరించిందా గొంతు.

అతను ట్రంకు వదిలేసి చేతులెత్తాడు వెంటనే.

లాల్ అతని తల వెనుక ఫట్‌మని కొట్టాడు, రివాల్వర్‌ని తిప్పి పట్టుకొని. అతను తల పట్టుకోకముందే ఇంకోసారి కొట్టాడు అదే బలంతో. మొదలు నరకిన మానులా కూలిపోయాడు జింబో. అతను తల పైకెత్తి కళ్ళు మూతపడుతుండగా లాల్‌ని చూశాడు.

"బలే దెబ్బతీశారు సర్, మీరు...." అస్పష్టంగా అన్నాడు.

"అయాం సారీ, జింబో."

రివాల్వర్ జేబులో పెట్టుకుని, స్పృహ తప్పిన జింబోని లాక్కెళ్ళి ఆ గదిలోనే వదిలాడు లాల్.

వాళ్ళు ముగ్గురూ వరుసగా పడుకున్నారు.

లాల్ ముగ్గురి జేబులు వెతికాడు. జింబో జేబులో రివాల్వర్ మాత్రమే వుంది. దాన్ని తీసుకుని, భారంగా నిట్టూరుస్తూ బయటికొచ్చాడు. గదికి తాళంవేసి, వేగంగా ఇంటిని సోదా చేశాడు. ఏమీ దొరకలేదు పనికొచ్చేది. ఆ ట్రంకులో కూడా ఏమీ లేదు. బయటికొరికి వ్యాను చేరుకున్నాడు. అదిప్పుడు ఆకుపచ్చ రంగులోకి మారి పోయింది.

వ్యానులో వెతికి, అందులో ఏమీ లేకపోవడంతో, ఇంటి తలుపులు మూసేసి, తిరిగివచ్చి వ్యానెక్కాడు. స్టార్టుచేసి వేగంగా పోనిచ్చాడు.

మెయిన్ రోడ్డుమీదికి వచ్చాకగాని తెలియలేదు, అది బోవెన్‌పల్లి ప్రాంతమని, ఆ ఇల్లు మైదానంలాటి ఏకాంత ప్రదేశంలో వుందని. అతనలా డ్రైవ్ చేస్తూ మధ్యలో కన్పించిన ఒక పెట్రోలు బంకులోకి తిప్పాడు.

అక్కడ దిగి, లోపలికెళ్ళి, ఫోన్ ఎత్తి చకచకా డయల్ చేయసాగాడు....

• • •

అప్పుడామె గేటు తీసుకుని లోపలికెళ్ళి, ఆ యింటి బెల్లు నొక్కింది.

పరిసరాలన్నీ నిశ్శబ్దంగా వున్నాయి.

లోపలెక్కడో బెల్ మోగి, వెంటనే అలికిడి విన్పించిందామెకు. పక్కకు జరిగి నిలబడిందా చీకట్లో.

కాస్సేపట్లో తలుపు తీసి, ఒకతను చూశాడు. "ఓహ్, నిర్మల!" అన్నాడతను. బయటికొస్తూ. "పద పద, అటు వెళ్దాం....నువ్వొస్తావనే చూస్తున్నాను....ఇంత రాత్రి వచ్చావేం...."

అతను మెట్లు దిగుతున్నాడు.

ఆమె కదల్లేదు. "నిర్మల పంపింది నన్ను" అంది చిన్నగా.

అతను ఆగి వెనక్కి చూశాడు. "నువ్వా...." అంటూ ఇంకా దగ్గరికి వచ్చి చీకట్లో ఆమె ముఖాన్ని చూడడానికి ప్రయత్నించాడు, "నువ్వా...."

"నిర్మల వ్రాసింది మాకు. ట్యూషన్ కొచ్చే ఆమెని నువ్వు నీ భార్య ఇంట్లో లేనిది చూసి...." అక్కడితో ఆమె మాటలాగిపోయాయి.

అదిరిపడ్డాడతను. "నువ్వు....నువ్వు....సుహాసినీ!"

"లెక్చరర్ జనార్థనరావు, నువ్వు మర్యాద తప్పి ప్రవర్తిస్తున్నావు."

ఆమె చేతిలో కత్తి మెరిసింది.

దాన్ని చూపిస్తూ దగ్గరికొచ్చిందామె. అది తళుక్కున మెరవడం చూశాడతను, వెనక్కి గంతులేస్తూ. ఆమె

ముందుకు కదిలింది ఇంకా వేగంగా, బుసలుకొడుతూ. ఆమె ముక్కు పుటాలు అదురుతున్నాయి. కళ్ళలో విచిత్రకాంతి మెరిసింది. కెవ్వున కేక వేసి అతను ఆమె చేతిని పట్టేసుకున్నాడు.

అప్పుడామె యెడమచేత్తో ముఖంమీద కొట్టిందిలాగి. అతడా చేతిని వదలకుండా పట్టుకుని లాగాడు. కత్తి జారి కింద పడిపోయింది. ఇద్దరూ తూలి మెట్లమీంచి జారి కిందపడ్డారు. అతడింకా అరుస్తూ ఆమెని వదలకుండా భుజాలు పట్టుకున్నాడు. అతడిమీద ఆమె పెనుగులాడుతూ రక్కుతోంది, కొరుకుతోంది. కత్తి కోసం చేయి జాపుతోంది. కత్తి అతని చేతికి చిక్కిపోయింది. అతన్నింకా కొట్టి, కొరికి, రక్కి లేచిపోతూండగా కత్తి విసిరాడు తను చేత్తో. ఆమె చేతిలోకి వచ్చి దిగింది కసిక్కున, కుడిచేతిలోకి. అతనొక్క ఉదుటున లేస్తూండగా ఆమె లాగిపెట్టి కడుపులో తన్ని పరుగుతీసింది గేటువైపు. గేటు తీసుకుని బయట కురకసాగింది శక్తి కొద్దీ....

అతను వెనుక అరుస్తూ పరుగెత్తుతోంటే అలజడికి ఇళ్ళలో జనం లేచి వచ్చారు. "పట్టుకోండి హంతకిని! పారిపోతోంది. పట్టుకోండి ఆమెని!" అతని అరుపులకి వాళ్ళంతా ఆలస్యం చేయకుండా వెంటపడ్డారు. ఇరవై గజాల దూరంలో వురుకుతున్న ఆమె మీదికి రాళ్ళు విసరసాగారు గట్టిగా కేకలు వేస్తూ. ఆ రాళ్ళ వర్షాన్ని తప్పించుకుంటూ ఆమె యెవరికీ అందకుండా వెళ్ళి కారెక్కేసింది. స్టార్టు చేసేసింది. మరొక్క క్షణం అక్కడ వుండకుండా దూసుకెళ్ళింది — వెనుకనుంచి టపటపమని కారుమీద రాళ్ళు పడుతోంటే.

కారు కనుమరుగైంది. జనం ఆగిపోయారు. జనార్ధన రావుని చుట్టుముట్టారు. అతనింకా ఆవేశంతో వూగిపోతూ, రక్తం అంటిన ఆ కత్తిని పట్టుకుని పరుగు తీశాడు.

"ఎక్కడికి?" అరిచారందరూ.

"పోలీస్ స్టేషన్‌కి!" అతడలాగే వురికాడు.

* * *

"హౌ ఈజిట్ పాసిబుల్?" అన్నాడు లాల్ ఆందోళనగా, కృష్ణన్‌ని చూసి.

కృష్ణన్ తల వంచుకున్నాడు, "అలా జరిగింది, మిస్టర్ లాల్. నన్నేం చేయమంటారు? మేం వెళ్ళేసరికి వాళ్ళు తెలివిలోకొచ్చి తెలివిగా తప్పించుకున్నారు. నన్నేం చేయమంటారు?"

"డామిట్!"

"డామిటే మరి."

"ప్లీజ్, బి సీరియస్, కృష్ణన్."

నవ్వాడు కృష్ణన్. "ఎలా వుండమంటారు? మీ పొరపాటూ వాళ్ళ తెలివితేటలు చూస్తే నవ్వొస్తోంది. మీరా మిగతా ఇద్దర్నీ కూడా కట్టి పడవేయలేదు. వాళ్ళిద్దరు తెలివిలోకొచ్చి మిగిలినవాడి కట్లు విప్పేసి, కాట్‌ని లాగి, దానిమీద టేబుల్‌ని ఎక్కించి, టేబిల్ పైన తాము ఎక్కి, పైన కప్పుమీద పెంకులు తీసేసి బయట పడ్డారు—కప్పుమీకి పారిపోయారు."

"ఓహ్, డామిట్! మరి జాన్ ఏమయ్యాడు?"

ఈ ప్రశ్న రాత్రినుంచీ అడుగుతున్నాడు లాల్. కృష్ణన్ సమాధానమొక్కటే. తెలియదు, ఏమయ్యాడో.

(ఇంకా వుంది)